## క్లుప్తంగా

### దివ్యాంగులకు క్రీడాపోటీలు



**వినుకొండ(నూజెండ్ల):** కమిట్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని నాగులవరం గ్రామంలో చిమటా లీలావతి విజ్ఞాన వికాస కేంద్రంలో ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులైన పిల్లలకు ఆట, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దివ్యాంగులు సకలాంగుల కంటే తక్కువేమీ కాదని, వారు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటేశ్వరరావు, దేవి, వికలాంగుల గ్రూప్ లీడర్ వెంకాయమ్మ, అంకిరెడ్డి, ప్రోగ్రామ్ మేనేజర్ ఉదయ్, ఓఏపీ ప్రాజెక్టు సుకన్య (సీఆర్పీ), సీఎఫ్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### బీఎల్ఓలు వెంటనే రిజిస్టర్లు పూర్తిచేయాలి

ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి



**రొంపిచర్ల:** ఓటరు ప్రత్యేక క్యాంపెయిన్ డే సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి రొంపిచర్ల మండలంలోని పోలింగ్ కేంద్రాలు 5,6,7,8,9,10,11,12,13,14,15,16,17లను పరిశీలించారు. బీఎల్ఓల వద్దనున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. వి.రెడ్డిపాలెం గ్రామాల బీఎల్ఓలు కొందరు రిజిస్టర్లు పూర్తి చేయకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. వారికి తగిన సూచనలు ఇచ్చి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఆసక్తిగా కొనసాగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు



**దుర్గి:** ప్రసిద్ధిగాంచిన హరిహర బాల నాగేంద్రస్వామి తిరునా సందర్భంగా ధర్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బల ప్రదర్శన మూడో రోజు కొనసాగింది. ఆదివారం ప్రత్యేక కేటగిరి విభాగంలో హైదరాబాదుకు చెందిన మేక రామకృష్ణ ఎడ్లు నిర్ణీత సమయంలో ఐదు వేల అడుగులు దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషస్వారెడ్డి ఎడ్లు 4,798.8 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానం, పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన దేవ భక్తుని శ్రీకాంత్ చౌదరి ఎడ్లు 4,758 అడుగులతో మూడవ స్థానం, కృష్ణా జిల్లా కొక్కిలగడ్డ గ్రామానికి చెందిన రాఘవయ్య మెమోరియల్ బాబు 4,385.05 అడుగులతో నాలుగవ స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు 4,300 అడుగులతో ఐదవ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతు సోదరులు, పశుపోషక అభిమానులు తరలివచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు. పోటీల వ్యాఖ్యాతగా గూడా రామకృష్ణ వ్యవహరించారు. నిర్వాహకులు ఎడ్ల యజమానులకు తగిన ఏర్పాట్లను చేసి పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

### పల్నాటి ఉత్సవాలకు కొనసాగుతున్న పనులు

**కారెంపూడి:** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో పల్నాటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన జరుగుతోంది. నాగులేరు గంగధారి మడుగుకు ఇరువైపులా ఆదివారం మెట్ల నిర్మాణం చేశారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్ దగ్గరుండి పనులు చేయించారు. గంగధారిలో దిగి పల్నాటి వీరాచారవంతులు ఆయుధాలు శుభ్రం చేసుకోడానికి వీలుగా సర్పంచ్ మెట్లు నిర్మాణ పనులు చేయించారు. గంగధారి మడుగు ఒడ్డునే వీరుల గుడి ఉంది. పల్నాటి వీరాచారవంతులు తమ ఆయుధాలు (దైవాలు)తో తరలివచ్చి ముందుగా నాగులేరు గంగధారిలో స్నానాలాచరించి ఆయుధాలను శుభ్రం చేసుకుంటారు. అదే విధంగా ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో ప్రతి రోజూ గంగధారిలో వీరాచారవంతులు స్నానాలాచరించడం చేస్తారు. ఇదిలా ఉంటే పల్నాటి వీర్ల అంకాలమ్మతల్లి గుడి సమీపంలో ఉన్న బాలచంద్రుని పొట్టేలు దూకిన పాద ముద్రలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడకు సమీపంలోని కోట బురుజుకు, తోట బజారులో ఉన్న బ్రహ్మనాయుడు మేడ (కత్తుల బావి మేడ), కన్నమదాసు మండపానికి రంగులు వేయిస్తున్నారు. ఇప్పటికే రణక్షేత్రంలో బ్రహ్మనాయుడు విగ్రహం ఉంది. కన్నమదాసు మండప ప్రాంగణంలో కన్నమదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవ ప్రాంగణంలో ప్రజలకు వినోదాన్ని అందించే వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.

# ఆత్మీయతను పెంచే వన సమారాధనలు

### ఆర్యవైశ్యుల కార్తిక వన సమారాధనలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ఆర్యవైశ్య నాయకులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** ప్రజల మధ్య సఖ్యతను, ఐక్యతను, ఆత్మీయతను పెంచేందుకు వనసమారాధనలు దోహదపడతాయని, ఆర్యవైశ్యులు సమష్టిగా తమ సామాజికవర్గంతో పాటు, సామాజికాభివృద్ధికి కూడా కృషి చేయాలని శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ప్రాంగణంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల కార్తిక వనసమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాంత్రిక జీవనంలో కార్తికమాసం కొత్త శోభను తీసుకువస్తుందని, ఆత్మీయులందరు ఒకచోట చేరడం వలన బంధాలు, బాంధవ్యాలు బలపడతాయన్నారు. ఒకరికొకరు అన్న సందేశం చేరి మనోధైర్యం పెరుగుతుందన్నారు. ఆర్యవైశ్యులు దాతృత్వం, సేవలో ముందుంటారన్నారు. వారికి వైఎస్సార్ సీపీ అండగా నిలిచిందని, తమ పార్టీలో మంత్రి పదవి ఇవ్వడంతో పాటు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి సంస్థ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, మహాసభ ప్రధాన కార్యదర్శి సాదుప్రతాప్, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జేఎన్‌టీయూ సెనేట్ మెంబరు మిట్టపల్లి కోటేశ్వరరావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సీమాంధ్ర డ్రగ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిశోర్‌బాబు, కోటప్పకొండ ట్రస్టు బోర్డు మెంబరు దివ్వెల రామకృష్ణ, తదితర ఆర్యవైశ్య సంఘం పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

**సకల కళాకారుల ఆధ్వర్యంలో...**

**వినుకొండ(నూజెండ్ల):** స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో సకల కళాకారుల కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలోని కళాకారులందరిని ఒకే చోట చేర్చి సమారాధన జరపడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గుమ్మడి దంపతులతో పాటు పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, న్యాయవాది పోట్లూరి సైదారావు, సినీ నటుడు బి.కోటియాదవ్, కె.వి.రామాంజనేయులు, కూచి రామాంజనేయులు, ముత్తినేని గిరిబాబు, రమణాంజలి, భావన రామ్మోహన్‌రావు, నాగమల్లేశ్వరరావు, రాము, రామాపురం వెంకటేశ్వర్లు, కంచర్ల నారాయణ, పారెళ్ల కృష్ణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**శాలివాహన, కుమ్మర సంఘం ఆధ్వర్యంలో...**

**చిలకలూరిపేట:** వన సమారాధనలు ఐక్యత, ఆత్మీయతను పంచుకొనేందుకు దోహదపడతాయని ఏపీ కుమ్మర, శాలివాహన సంఘం కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తమ్ చెప్పారు. పట్టణంలోని విజ్ఞాన్ విహార్ స్కూల్ ప్రాంగణంలో నియోజకవర్గ శాలివాహన, కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండేపూడి మాట్లాడుతూ కులంలోని పేద వారికి విద్య, వైద్యం అందించటానికి సంఘం అండగా నిలవాలని చెప్పారు. సామాజిక సేవలో సంఘ సభ్యులు ముందుండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంతా ఐకమత్యంగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ నాయకులు ఐలాపురం భాస్కర శ్రీనివాస్, నిడమానూరు హనుమంతరావు, వై.రాధాకృష్ణ, పి.నాగరాజు, మురికిపూడి నాగబాబు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కుమ్మర శాలివాహన సంఘం నాయకులు

**ఆర్యవైశ్యుల వనసమారాధన..**

**నాదెండ్ల:** గణపవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ముందుగా 20 మంది దంపతులు పీటలపై కూర్చుని సత్యానారాయణ వ్రతాలు చేశారు. పూజారులు దర్శి అనిల్ కుమార్, ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో ముందుగా ఉసిరి చెట్టుపూజ, కార్తిక వనపూజలు నిర్వహించారు. గణపవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అయితా శ్రీనివాసరావు, కార్యదర్శి సుబ్బారావు, ట్రెజరర్ వీరరాఘవయ్య, వాసవీక్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి హనుమంత్ ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**రజక సంఘీయుల సమారాధన..**

**రొంపిచర్ల:** స్థానిక శివాలయ ఆవరణలో ఆదివారం మండల రజక కార్తిక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాలకు చెందిన రజకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజక సంఘం రాష్ట్ర నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు మాట్లాడుతూ రజకులు అన్నిరంగాల్లోనూ వెనుక బడి ఉన్నారని, చిన్నారుల విద్యపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే బీసీ కుల గణన కార్యక్రమంలో రజకులందరూ పాల్గొనాలని కోరారు. కోటప్పకొండ రజక అన్నదాన సత్రం కమిటీ అధ్యక్షుడు మత్రిపూడి రాంబాబు, కార్యదర్శి దావులూరి శ్రీనివాసరావు, బీసీ సంఘం మండల నాయకుడు చక్రవరం సత్యనారాయణరాజు, రజక సంఘం మండల అధ్యక్షుడు పిడెం హుస్సేన్, మండల గౌరవ అధ్యక్షుడు అద్దంకి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రెడ్ల కార్తిక వన సమారాధన



వేమారెడ్డి, వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న సంఘం ప్రతినిధులు

**వినుకొండ(నూజెండ్ల):** వినుకొండ యోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల సేవా సమితి భవన్ నందు 9వ రెడ్ల కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత యోగి వేమారెడ్డి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత రెడ్ల సంక్షేమ సమైక్య గౌరవాధ్యక్షులు గోలమారు తాతిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్ల సంక్షేమ సమైక్య గౌరవాధ్యక్షుడు పాలిమేర వెంకటరెడ్డితో పాటు పలువురు పెద్దలు పాల్గొని మాట్లాడుతూ వినుకొండలో సేవా సమితి చేస్తున్న సేవలను కొనియాడారు. మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ప్రతి మహిళకు చీర పంపిణీ చేశారు. అనంతరం తిరుమల నర్సింగ్ హోం ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో తమ హాస్పటల్‌లో చికిత్సలు అందజేస్తున్నట్లు హాస్పటల్ డైరెక్టర్ కూరపాటి అప్పిరెడ్డి తెలిపారు. అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు ఆర్.శివారెడ్డి, మూలె వెంకటేశ్వరరెడ్డి, అనుమల నాసరరెడ్డి, ఎంపీపీలు పగడాల వెంకటరామిరెడ్డి, మేడం జయరామిరెడ్డి, కన్వీనర్ చెన్నకేశవరెడ్డి, ట్రెజరర్ రామిరెడ్డి, సెక్రటరీ పెద్దిరెడ్డి సుధాకరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 98 శాతం పింఛన్ల పంపిణీ



**నాదెండ్ల:** మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఆదివారం మూడోరోజు వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ 98 శాతం పూర్తయింది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. మండల పరిధిలో 9661 మంది లబ్ధిదారులకు గాను రూ.2,66,46,750లు పంపిణీ చేయాల్సి ఉంది. ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

**ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత...**

గణపవరం రెండో సచివాలయం పరిధిలో రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసం ఉండే పఠాన్ జైనాబీ దివ్యాంగురాలు. ఈమెకు గత వారం రోజులుగా అనారోగ్య సమస్యలతో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. సమాచారం తెలుసుకున్న ఆ ప్రాంత వలంటీర్ నాగేంద్ర ఆసుపత్రికి వెళ్లి రూ.3 వేలు పింఛను సొమ్ము అందించారు. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ వలంటీర్‌ను ధన్యవాదాలు తెలిపారు.

### ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

**బొల్లాపల్లి:** పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 15 టీమ్‌లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు బాపట్ల, బేతపూడి, పల్నాడు, రెడ్డిపాలెం టీమ్‌లు వరుసగా గెలుపొందాయి. గెలుపొందిన విజేతలకు శ్రీచక్ర సిమెంట్స్, శివశక్తి లీలా ఫౌండేషన్, రెడ్డిపాలెం ఎంప్లాయీస్ యూనియన్ తదితరులు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ బహుమతుల్లో ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ 15,116, తృతీయ 10,116, 4వ బహుమతి 7,116లు విజేతలకు అందజేశారు

## ఓటర్ల తొలగింపులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

### తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు



మాట్లాడుతున్న తహసీల్దార్

**శావల్యాపురం:** ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓట్లు తొలిగింపులపై ఒక వ్యక్తి ఐదు, బీఎల్‌ఓలు 10కి మించి ఫామ్–7 దరఖాస్తులు చేయరాదని తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఓట్లు ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలకు వస్తున్న అర్జీలపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అభ్యంతరకరంగా ఉన్న తొలగింపులు కొరకు పెట్టిన దరఖాస్తులు అవాస్తవాలు అని విచారణలో నిర్ధారణ అయితే అటువంటి వారికి ప్రజాప్రాతినిధ్యం చట్టం 1950 సెక్షన్ 31 ప్రకారం ఫామ్–7 దరఖాస్తు చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా విధించవచ్చన్నారు. శావల్యాపురంలో మండలంలో ఇప్పటి వరకు ఫామ్–6 దరఖాస్తులు 2185 రాగా 1593 అమోదించామన్నారు. ఫామ్–7 అర్జీలు 4125 రాగా 1791 దరఖాస్తులను అమోదించినట్లు తహసీల్దార్ తెలిపారు. నూతన ఓటర్ల జాబితాలో ఓట్లు తొలిగింపులు, చేర్పులు, మార్పులు తదితరవన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయని ప్రజలు అపోహలు నమ్మరాదన్నారు. అన్నిపార్టీల ప్రజాప్రతినిధులు ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకపోతే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు ఉన్నారు.

### ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

**యడ్లపాడు:** మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో రెండురోజులు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగిసింది. శని, ఆదివారాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్‌లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వసంతబాబు మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఎల్‌ఓలకు అందిన దరఖాస్తులను గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వద్ద ఉన్న రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే బోయపాలెంలోని ఎన్నికల కేంద్రాన్ని మండల తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి వైవీబీ కుటుంబరావు పరిశీలించారు. ఆదివారం మొత్తం 57 పోలింగ్ కేంద్రాల్లో 108 దరఖాస్తులు ప్రజలు అందించారు. వీటిలో ఫారం(6)– 68, ఫారం(7)–11, ఫారం (8)–29 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

**ఓటర్ల జాబితాలో సవరణలకై 67 దరఖాస్తులు...**

**నాదెండ్ల:** మండలంలోని 57 పోలింగ్ బూత్‌ల్లో బీఎల్‌ఓలు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రెండో రోజు ఆదివారం 67 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో ఫారం–6లు 31, ఫారం–7లు 19, ఫారం–8లు 17వచ్చాయి. తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు నాదెండ్లలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో స్పెషల్ డ్రైవ్ సందర్భంగా 138 దరఖాస్తులు అందాయని, క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించాలని ఆదేశించారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

**నకరికల్లు:** కార్తీకమాసం పురస్కరించుకొని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేందుకు విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు అన్నారు. త్రైతసిద్ధాంతం – ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నకరికల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహ్య విషయాలు వీడి అంతర్ముఖులై చూస్తే ఆత్మదర్శనం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం–ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు



పూజాబలిలో విచారణ గురువులు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- తేరు ఊరేగింపుతో ముగిసిన ఉత్సవాలు
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**బొల్లాపల్లి:** మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాలు కొవ్వొత్తుల ప్రదర్శన, తేరు ఊరేగింపుతో ఆదివారం ఘనంగా ముగిశాయి. విచారణ గురువులు రెవ.ఫాదర్ తంబిరాజు పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజాబలి కార్యక్రమంతో పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పూజాబలి కార్యక్రమంలో పాల్గొని పునీత శౌరి వారి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన గురువులు రెవ.ఫాదర్ బవిరి సురేష్‌బాబుతో పాటు మరో 25 మంది విచారణ గురువులు పూజాబలి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్యస్త్రీలు, భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం రాత్రి గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు తేరు ఊరేగింపు నిర్వహించారు.

## పథకాలు పొంది సచివాలయ వ్యవస్థపై ఆరోపణలా..?

### మహిళ ఆరోపణలను ఖండించిన వార్డు పరిపాలన కార్యదర్శి

**నరసరావుపేట:** చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన గోగిరెడ్డి విజయమ్మ అనే మహిళ సచివాలయంలో ఎటువంటి పనులు జరగట్లేదని, ఏ పనిచేయాలన్నా డబ్బులు వసూలుచేస్తున్నారంటూ చేసిన ఆరోపణలను వార్డు సచివాలయ పరిపాలన కార్యదర్శి బీకే కవిత ఖండించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 24వ వార్డులో నివాసం ఉంటున్న విజయమ్మ సచివాలయానికి వచ్చిన తన రేషన్‌కార్డులో ఉన్న తన కుమార్తెకు వివాహం జరిగినందున ఆమె పేరును తొలగించాలని కోరిందన్నారు. ఆమె ఆధార్‌కార్డు పరిశీలించగా చేబ్రోలు మండలానికి చెందిన వారు కాబట్టి అక్కడకు వెళ్లి మార్పించుకోవాలని సూచించామన్నారు. అయినప్పటికీ ఆ పని చేసేందుకు ప్రయత్నించగా ఆమె కుమార్తె వివాహం జరిగినట్లుగా తగిన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు అప్‌లోడు చేయాలని ఆన్‌లైన్ సూచించిందన్నారు. వాటిని తీసుకురాకుండా పని చేయనందుకు తమపై లేనిపోని ఆరోపణలు చేసిందన్నారు. ఆమెకు వైఎస్సార్ పింఛను, ఈబీసీ నేస్తం, మనవడికి అమ్మఒడి తదితర సర్వీసులు, సంక్షేమ పథకాలు సచివాలయం నుంచి పొంది తమపై ఆరోపణలు చేయటం బాధాకరంగా ఉందన్నారు. ఆమె చేసిన ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా విచారణ చేసి ఆమెపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారన్నారు.

### గుర్తుకొస్తున్నాయి..!

### బాలుర మున్సిపల్ హైస్కూల్ 1975–76 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం



47 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**నరసరావుపేట:** ఒక చోట చదువుకొని దేశ, విదేశాల్లో వివిధ ప్రదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు 47ఏళ్ల అనంతరం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. వారి వారి కుటుంబాల విశేషాలను చెప్పుకొన్నారు. తమ ఆరోగ్య పరిస్థితులను గురించి తెలుసుకొని ఒకరినొకరు సలహాలు ఇచ్చుకున్నారు. ఈ సంఘటన పట్టణంలో ఆదివారం జరిగింది. పట్టణంలోని బాలుర ఉన్నత మున్సిపల్ హైస్కూలు 1975–76 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన వారందరూ 47 ఏళ్ల అనంతరం మొదటి రైల్వేగేటు సమీపంలోని స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో ఆదివారం సమావేశమయ్యారు. అందరూ ఒకేవిధమైన టీషర్టులు ధరించి పాల్గొన్నారు. వారి అపూర్వ సమ్మేళనం భావితరాలకు మార్గదర్శకంగా మారనుంది.

**జవహర్ నవోదయ విద్యాలయంలో...**



మాట్లాడుతున్న జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు

**చిలకలూరిపేటటౌన్:** విలువలతో కూడిన విద్యనిచ్చిన విద్యాలయాన్ని పూర్వ విద్యార్థులు మరవరాదని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1988 సంవత్సం నుంచి 2022 మధ్య విద్యనభ్యసించిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలు, ఆనాటి సంఘటనలు గుర్తుచేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ కమిషనర్ సి.ప్రభాకరరెడ్డి, పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**నాదెండ్ల:** ఎండుగుంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ నోవాకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, కంటి వైద్య నిపుణులతో పాటూ స్త్రీల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. మెనంపాడు నైస్ పాఠశాల సిబ్బంది అల్పాహారం పంపిణీ చేశారు.


**ప్రకృతి వ్యవసాయంపై అవగాహన...**

సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ చంద్ పాలేకర్ శిష్యులైన విద్యారాం స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చి, పలు సూచనలు చేశారు.

### ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు

**రెంటచింతల:** మండల కేంద్రమైన రెంటచింతలలో ఎంఆర్ఎఫ్ షోరూం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన జరిగింది. స్థానిక ఆంజనేయస్వామి మాన్యం కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో పత్తితీత పనులకు వెళ్తుండగా అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మారెబోయిన ఆదిలక్ష్మి, గుమ్మా రమణ, అంజిలకు తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గుంటూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి, స్వల్పంగా గాయపడిన వారిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిమితికి మించి వ్యవసాయ కూలీలతో ఆటోలు వెళ్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అన్నారు.

### వైభవంగా శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల



**అమరావతి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతికి సమీపాన ముత్తాయిపాలెం గ్రామంలో వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ముత్తాయిపాలెం చేరుకున్నారు. ఉదయం ఆరు గంటలకు ఆలయంలో పూజలు ప్రారంభించారు. తొలుత విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ అనంతరం బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో 8గంటలకు గణపతి హోమం, గ్రామదేవతల ఆహ్వానంలో ఊరుబయట ఉన్న గ్రామ దేవతల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరాశరం రామకృష్ణమాచార్యులు యాజ్ఞిక పర్యవేక్షణలో భక్తులచే లక్ష్మీనారాయణ, గాయత్రీ, సుదర్శన హోమం నిర్వహించి అమ్మవారికి ఏకనామ కుంకుమార్చన, శాంతిహోమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పలురకాల పుష్పమాలలతో కన్నుల పండువగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్ళు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.